క్లుప్తంగా

ఎంఎస్పీ మండల నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

కందుకూరు: ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ(మహాజన సోషలిస్టు పార్టీ) మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో మంద కృష్ణమాదిగ ఆదేశాలతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబుమాదిగ, రాష్ట్ర కార్యదర్శి గట్టగళ్ల ప్రశాంత్‌మాదిగ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధానకార్యదర్శిగా అందుగుల కృష్ణ, అధికార ప్రతినిధిగా జంగయ్య, కన్వీనర్‌గా మల్లేపల్లి కృష్ణ, కో కన్వీనర్లుగా భాస్కర్, రాజు, రాము, భాస్కర్‌ను నియమించారు. ఆ పార్టీ నాయకులు మండల కోఆర్డినేటర్ యాచారం పాండు మాదిగ పాల్గొన్నారు.

నాలుగేళ్లయినా పరిహారం ఎందుకు అందలేదు?

కందుకూరు: నాలుగేళ్ల క్రితం వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన వారి కుటుంబీకులకు ఇంత వరకు పరిహారం అందలేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. అప్పట్లో మంత్రిగా ఉన్న సబితారెడ్డి ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడారు. 2020లో వచ్చిన వరదల్లో బాచుపల్లి, బేగంపేటకు చెందిన ఇద్దరు అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో వరదల్లో చిక్కుకుని మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులకు పరిహారం అందించడంలో నాటి పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్రం నుంచి విపత్తు నివారణ ద్వారా వచ్చిన నిధులను దారి మళ్లించి, ప్రభుత్వ ఖజానాను దివాలా తీయించారని విమర్శించారు. ఎన్నికల ముందు పరిహారం విడుదల చేస్తున్నట్లు మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబీకుల చేతుల్లో పెట్టి మభ్యపెట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు.

అందుబాటులో లేని వారికి మరో అవకాశం

తుక్కుగూడ: కులగణన సర్వేలో భాగంగా డోర్ లాక్ ఉండి, అందుబాటులో లేకుండా సర్వే చేసుకోని వారికి మరోసారి అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ వాణి తెలిపారు. మిస్ అయిన వారు.. సెల్ నంబర్ 9010314956లో సంప్రదించాలని సూచించారు. అనంతరం ఎన్యుమరేటర్లు అందుబాటులోకి వస్తారని వెల్లడించారు.

నూతన వధువుకు పెళ్లి కానుక



యువతికి చీర, నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

కందుకూరు: మండల పరిధి బాచుపల్లి గ్రామానికి చెందిన పేద కుటుంబం శ్యాం, శాంతమ్మ కుమార్తె మమత వివాహం నేపథ్యంలో.. మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆదివారం యువతికి చీరతో పాటు రూ.పది వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. గ్రామంలో నిరుపేదలకు తన వంతు సహాయం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వెండి చీర బహూకరణ



అర్చకులకు వెండి చీరను అందజేస్తున్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి జిన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం నగరానికి చెందిన మోహన్ కృష్ణ దివ్య దంపతులు.. దేవతా మూర్తులకు రెండు కిలోల వెండి(రజిత) చీరను బహూకరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్యానికి ఉదయం నడక శ్రేయస్కరం

కడ్తాల్: ఆరోగ్యానికి ఉదయపు నడక ఎంతో శ్రేయస్కరమని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్ అన్నారు. మండల కేంద్రం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి వాకర్స్ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఆయన ఆదివారం డోజర్ సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించి, చదును చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు నరేశ్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

ధాన్యం.. దళారుల పాలు!

- కొర్రీలతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురాని రైతులు
- ప్రభుత్వ మద్దతు ధర చెల్లిస్తున్న వ్యాపారులు
- కల్లాల్లోనే విక్రయిస్తున్న అన్నదాతలు



వడ్లను ఆరబోసిన అన్నదాతలు

కందుకూరు: ధాన్యం దళారుల పాలవుతోంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీలతో అత్యధిక రైతులు తమ దిగుబడిని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించినప్పటికీ.. తేమ శాతం సరిగా లేకపోయినా, అధికంగా తాలు ఉన్నా, నాణ్యత ప్రకారం లేకున్నా నిర్వాహకులు వెనక్కి పంపిస్తుండటం తదితర కారణాలతో.. అన్నదాతలు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

వాతావరణం అనుకూలించక

పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఈ నెల 4వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయినా ఇప్పటివరకు కేవలం 9 మంది రైతులు 609 బస్తాలను మాత్రమే ఇక్కడ విక్రయించారు. తేమ శాతం 17లోపు ఉండాలని, వడ్ల గింజలను తూర్పార బట్టి తాలు లేకుండా ధాన్యాన్ని కేంద్రానికి తీసుకు రావాల్సి ఉంటుంది. అన్ని సక్రమంగా ఉంటే క్వింటాల్ సన్న రకానికి రూ.2,320లతో పాటు రూ.500 బోనస్ అందజేస్తున్నారు. దొడ్డు రకానికి రూ.2,300ల చొప్పున సేకరిస్తున్నారు. ప్రస్తుత వాతావరణం నేపథ్యంలో చలి కారణంగా త్వరగా వడ్లు ఆరకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ధర తక్కువయినా..

కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కండీషన్లతో సతమతమవుతున్న కర్షకులు.. కాస్త ధర తక్కువయినా రవాణ ఖర్చులు, సమయం కలిసి వస్తుందంటూ కల్లాల్లోనే దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. క్వింటాల్ రూ.2,100 నుంచి 2,300 ఆపై ధర చెల్లిస్తూ.. నేరుగా పొలాల నుంచే వారు వ్యాపారులు సేకరిస్తుండడంతో, రైతులు తమ దిగుబడిని కొనుగోలు కేంద్రాలకు తేవడానికి ఇష్టపడటం లేదు.

బియ్యంగా మార్చి..

ఇటీవల ఓ రైతు తన దిగుబడిని కొనుగోలు కేంద్రానికి తరలించగా, తేమ ఒక్క శాతం అధికంగా 18 శాతం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ధాన్యాన్ని వెనక్కి తీసుకెళ్లలేక కొనుగోలు కేంద్రం వద్దే.. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకే ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నాడు. లేని పక్షంలో రైతులే స్వయంగా రైస్‌మిల్‌కు తరలించి బియ్యంగా మార్చుకొని విక్రయిస్తున్నారు.



కొత్తూర్ రైస్‌మిల్‌కు ధాన్యం తరలిస్తున్న రైతులు



నిర్వాహకుడికి చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

గ్రామాభివృద్ధే లక్ష్యం

పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి

మహేశ్వరం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పని చేస్తానని పీఏసీఎస్ మండల వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాణిక్యమ్మగూడ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తన సొంత నిధులు రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో 90 శాతం నేరాలను తగ్గించొచ్చన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. సీఐ ఆదేశాల మేరకు గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో దొంగతనాలు, నేరాలు, అసాంఘిక కార్యక్రమాలను నియంత్రించొచ్చన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతుగా సహకారం అందించడం గర్వంగా ఉందన్నారు. అంతకుముందు సీసీ కెమెరాల ఏర్పాటుకు కావాల్సిన లక్ష రూపాయల చెక్కును కెమెరాలు బిగించేవారికి ఆయన అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు



కారును తనిఖీ చేస్తున్న సీఐ కృష్ణంరాజు

యాచారం: రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు హెచ్చరించారు. పీఎస్ పరిధి మీరాఖాన్‌పేట- కుర్మిద్ద గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీలు చేశారు. లైసెన్స్, ఆర్‌సీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పరిమితికి మంచి ప్రయాణికులకు ఎక్కించుకుని వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అజాగ్రత్త తమను నమ్ముకున్న వారిని రోడ్డున పడేలా చేస్తుందని, బయటకు వెళ్లే ముందు కుటుంబీకులను గుర్తుకుపెట్టుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు సమగ్ర సర్వే

- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 96 శాతం
- మండలంలో 93 శాతం పూర్తి
- కొనసాగుతున్న డేటా ఆన్‌లైన్ ప్రక్రియ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ) సర్వే తుది దశకు చేరుకుంది. ఈ నెల 9 నుంచి సర్వే మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. పట్నం మున్సిపాలిటీలో 96 శాతం కులగణన పూర్తయింది. 7,868 ఇళ్లకు గాను ఆదివారం వరకు 7,541 కుటుంబాల వివరాల సేకరణ కాగా.. మిగతా 327 నివాసాలు మిగిలాయి. 102 ఈబీలకు (ఎన్యుమరేటర్ బ్లాక్. ఒక బ్లాక్‌కు 150 ఇళ్ల కేటాయింపు) గాను 78 ఈబీల్లో వంద శాతం సర్వే పూర్తయింది.

మండలంలో 93 శాతం

ఇబ్రహీంపట్నం మండల పరిధి 14 గ్రామ పంచాయతీల్లో 11,151 ఇళ్లను గుర్తించి 93 శాతం కుటుంబ కులగణనను ఎన్యుమరేటర్లు పూర్తి చేశారు. మిగతా నివాసాలను ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ తెలిపారు. శేరిగూడ సమీపంలోని ఇందు కళాశాలలో డేటా ఆన్‌లైన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సర్వే కోసం సంప్రదించండి

కులగణన కాని వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 9866683040, 7675829268, 7386704867 నంబర్లను సంప్రదిస్తే.. ఎన్యుమరేటర్లు మీ ఇంటికి వస్తారని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఖానాపూర్ సమీపం గురునానక్ కాలేజీలో సర్వే వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

ముమ్మరంగా ఆన్‌లైన్ ప్రక్రియ

కడ్తాల్: సమగ్ర కుటుంబ సర్వే సమాచారం ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. ఒక వైపు సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుండగానే, మరో వైపు డేటా నమోదు చురుగ్గా కొనసాగుతోంది. మండలంలో మొత్తం 11,826 కుటుంబాలకు గాను, 11,532 కుటుంబాల గణన పూర్తయింది. స్థానిక ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై పాఠశాలలో 42 మంది ఆపరేటర్లు.. ప్రజల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. మండల పరిధిలో కుటుంబ సర్వే 96 శాతం పూర్తయిందని, డేటా నమోదును పర్యవేక్షిస్తున్నామని ఎంపీడీఓ సుజాత తెలిపారు.



కడ్తాల్: ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజనీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జైన్ మందిర్, చైతన్యపురి, హనుమాన్‌నగర్, గంగా ఆస్పత్రి, ఫణిగిరికాలనీ, ఫ్రూట్‌మార్కెట్, దుర్గానగర్, శివాలయం, గణేశ్‌పురి కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ టీఎస్ హౌసింగ్‌బోర్డు, యాదవనగర్, ప్రజయ్ నివాస్, మోర్, అష్టలక్ష్మి, అల్కాపురి, వాసవి కాలనీ, ఆర్‌కేపురం, ఇందు అరణ్య ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కార్తీకమాస వనభోజన మహోత్సవం

పహాడీషరీఫ్: శ్రీ భక్త మార్కండేయ శ్రీరామ కాలనీ పరస్పర పొదుపు సంఘం ఆధ్వర్యంలో మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం కార్తీకమాస వనభోజన మహోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కులదైవం మార్కండేయ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు ఆడుతూ పాడుతూ సందడి చేశారు. అనంతరం కలిసికట్టుగా భోజనాలు చేశారు. ఒకరికొకరూ పరిచయ కార్యక్రమంతో పాటు పెద్దలను సన్మానించుకున్నారు. కులస్తులందరూ ఐక్యంగా ఉంటూ ప్రగతి పథంలో నడవాలని ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

ఘనంగా కాటమయ్య పండుగ

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధి పోచారంలో కాటమయ్య పండగ ఘనంగా జరుగుతోంది. ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం స్వామి వారిని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, ఐఎస్ సదన్ మాజీ కార్పొరేట్ మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేష్‌లు దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌గౌడ్, నాయకులు రాజు, చిన్న, రమేష్, బుగ్గరాములు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం: డిసెంబర్ రెండో వారంలో ఇబ్రహీంపట్నంలో నిర్వహించే మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. మాదిగల హక్కుల సాధనకు, ఐక్యతను చాటేందుకు సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ పాల్గొనున్నారని, మాదిగలు తరలి రావాలని కోరారు. బీజేపీ నాయకుడు ప్రతాప్, బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ ఉన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం

కడ్తాల్: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన భాస్కర్‌రెడ్డిని.. భగత్‌సింగ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి మహేందర్, సభ్యులు అంజయ్య ఉన్నారు.

హోటళ్లు, పాన్ షాపులపై ప్రత్యేక డ్రైవ్



హోటళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్

పహాడీషరీఫ్: అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న హోటళ్లు, పాన్ షాపులు, ఇతర వ్యాపార సముదాయాలపై బాలాపూర్ పోలీసులు శనివారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. షాహిన్ నగర్, ఎర్రకుంట ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటాక కూడా మండీ హోటళ్లు, పాన్ షాప్‌లు తెరిచే ఉంటుండడంతో నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రేడ్ లైసెన్స్ సమయాన్ని ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. దీంతో పాటు రాత్రి పూట జల్సాగా తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. హోటళ్లు, పాన్ షాప్ నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన సమయానికి మూసి వేయాలన్నారు. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ డ్రైవ్‌లో ఎస్సైలు శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాలలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం సరికాదు

మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్

మహేశ్వరం: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మాలలను నిర్లక్ష్యం చేస్తున్నాయని మాలల ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో డిసెంబర్ 1వ తేదీన పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక మాలల తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మంద కృష్ణ మాదిగ మాటలు బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిమ్మి మాలలను నిర్లక్ష్యానికి గురిచేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మాలలు కష్టపడి పనిచేసి అధికారంలోకి తీసుకొస్తే, వారిని మోసం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. కేంద్రంలో మనువాద బీజేపీ ప్రభుత్వం చేతిలో మంద కృష్ణ మాదిగ పావుగా మారారని పేర్కొన్నారు. 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన బహిరంగ సభకు లక్షలాదిగా మాలలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాల మాహానాడు నాయకులు ఎకుల రాములు, కుమార్, తలారి రాజేశ్, దార జంగయ్య, ముత్యం, రాజేశ్, జనార్దన్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాలల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలకిషన్, నాయకులు

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో గజస్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో గుట్టపైన వెలసిన శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఉదయం ఆలయంలో అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, అమ్మవార్లు, స్వామివారికి పుష్పాలంకరణ పలు పూజలు నిర్వహించారు. ఆలయంలో మహాగణపతి ఆరాధన, పుణ్యాహవచనము, రక్షబంధన, అగ్ని ప్రతిష్ట, మూలదేవత హోమములు, సాయంత్రం హోమములు, గోవిందనామస్మరణ, ప్రసాద వితరణ కార్యక్రమాలు వేద పండితుల మధ్య కొనసాగాయి. బ్రహ్మోత్సవాలు తొలిరోజు కావడంతో ఆలయంలో భక్తులు భజనలు, స్వామివారి సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆవుల రమేశ్, ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్, కోశాధికారి కడల భాస్కర్, ఉపాధ్యాక్షులు కమ్మరి బుచ్చిబాబు చారి, నీరటి జగదీశ్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలంగౌడ్, మాజీ ఉపసర్పంచ్ పోతుల నర్సింగ్, మాజీ ఎంపీటీసీ కుమారి రాయప్ప, పీఏసీఎస్ డైరెక్టర్ ఆవుల పెద్ద నర్సింహ, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు బస్వ పాపయ్యగౌడ్, గ్రామ పెద్దలు అంజయ్య, చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య, ఎర్ర చంద్రమోహన్ ఆలయ అర్చకుడు తొండుపల్లి ప్రేమ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

గడువులోగా వివరాలు అందించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో సమగ్ర కుటుంబ సర్వే చేయించుకోని వారు మూడు రోజుల్లోగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో 28,175 కుటుంబాలను గుర్తించామని, ఇప్పటి వరకు 86.5 శాతం మేర 24,376 కుటుంబాలను సర్వే చేశామని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్క కుటుంబాన్ని కూడా వదలకుండా సర్వే చేస్తామన్నారు. మిగిలిన వారు మూడు రోజుల్లో సర్వే చేయించుకోవడానికి సహకరించాలన్నారు. సర్వే విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నా, ఎన్యుమరేటర్ రాకున్నా తాము సూచించినా ఫోన్ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. మేనేజర్ మొయిజుద్దీన్(95535 77753), ఆర్.ఐ భాను చందర్(70135 49605), డేటా ఎంట్రీ ఆపరేటర్ త్రివేణి(98668 37120) నంబర్లను సంప్రదించాలన్నారు.

హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మీర్‌పేట: కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోని ఇంటి యజమానుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ ప్రకటనలో తెలిపారు. హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జిగా రెవెన్యూ అధికారి డి.చంద్రశేఖర్‌రెడ్డిని ఫోన్: 9912238404, డెస్క్ అసిస్టెంట్‌గా బిల్ కలెక్టర్ వాసు: 9963104683ల నెంబర్లకు ఫోన్ ద్వారానైనా సంప్రదిస్తే కుటుంబ వివరాలను నమోదు చేస్తారన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో మూడురోజుల పాటు పట్టణ ప్రజలు హెల్ప్‌డెస్క్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని. కార్పొరేషన్‌లో 100 శాతం కుటుంబ సర్వేకు పట్టణ ప్రజలందరూ సహకరించాలన్నారు.

అందరూ సహకరించాలి

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను గడువులోగా పూర్తయ్యేలా ప్రజలందరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు కోరారు. సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసిందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్తీక వనభోజనాలు



ఆమనగల్లు: శివాలయ ఆవరణలో మహిళల వనభోజనాలు

ఆమనగల్లు: కార్తీక వనభోజనాలు ఘనంగా జరిగాయి. కార్తీకమాసం పురస్కరించుకుని కడ్తాల్ మండలం మైసిగండి శివాలయం ఆవరణలో ఆమనగల్లు పద్మశాలి సంఘం మహిళల ఆధ్వర్యంలో ఆదివారం ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ ఆవరణలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ, వరలక్ష్మి, లక్ష్మి, సువర్ణ, దర్శిణి, శ్రీదేవి, సరిత, దివ్య, వనిత, చాముండేశ్వరీ తదితరులు ఉన్నారు.

గట్టుఇప్పలపల్లిలో..

తలకొండపల్లి: మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో కార్తికమాసం వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ శివాజీ శాఖ ఆధ్వర్యంలో ఉసిరిచెట్టు కింద అరిటాకులతో భోజనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సహకార భారతి సహ కార్యవహ నాగిళ్ల కుమార్, ఆమనగల్లు సంఘ్ చాలక్ దొంతు విశ్వనాథం, అంజయ్య, యాదయ్య, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.